పరిణామము

పాలంకి వెంకటరామచంద్రమూర్తి

జానకమ్మముఖం ఎఱ్ఱబారింది. ఆమె చేతులో ఉన్న ఉత్తరాన్ని 'ఫర్రు' మని చింపి, దూరముగా విసరివేసింది.

"ఏమిటే?" అన్నాడు దగ్గుతో, ఎదురుగా సోఫాలో కూర్చునిఉన్న శ్రీనివాసరావుపంతులు.

"ఎంతపనిచేశారు?"

ఆమెనయనాలనుండి విస్ఫులింగములు రాల్తున్నాయి. 'ఆఉత్తరం తెచ్చినవార్త ఏమిటో?' అని ఆలోచించబోయాడు ఆవృద్ధుడు.

"ఇంకేముంది? నాప్రయత్నమంతా నేలగలిసింది! వాళ్లంతా ఏకమయి, నాపీకి పిసికేరన్నమాటే!"

"ఆసంగతేమిటో చెప్పేవుకా" దన్నాడు నెమ్మదిగా.

"పద్దెనిమిదేళ్లొచ్చిన వీడికి బుద్ధి ఉండక్కర్లేదూ?...ఎందుకుండాలి! వీడుమాత్రం వాళ్లల్లో వాడుకాదూ? పెంచుకున్నంతమాత్రం మనవాడయిపోతాడా?"

"ఏంచేశాడేమిటి రామం?" అని తిరిగి ఓమాటు ప్రయత్నంచేసి చూశాడు పంతులు.

"ఇంతకంటే ఏంచెయ్యాలి! మేనమామ తీసుకెళ్లి కూతురికి ముడెట్టేడు. ఇంకా బుద్ధిలేక, 'క్షమించాలి, మీదంపతులిద్దరూ దయచెయ్యాలి...' అని ఉత్తరం!......తోటపల్లికొండలకి షికారని పేరెట్టి నన్ను బుట్టలో పెట్టేడు మనవాడు— మనవాడేమిటి? మనడబ్బుకోసం చేరిన వాళ్లవాడే."

రామం చేసిన సాహసానికి శ్రీనివాసరావు ఆశ్చర్యపోయాడు మొదట. "జనకతల్లిదైవాళ్ల ప్రోత్సాహంవల్ల ఒడబడిఉంటాడు రామం. వాళ్లనేకవిధాల వీడికి నచ్చచెప్పిఉంటారు" అన్నాడు.

"అవును. వాడికి వాళ్లేముఖ్యం. నన్నందుకే గడ్డిపరకలాగ తోసిపారేశాడు."

"నీమాట తోసిపారేశాడంటావుకాని, కొంచెం ఆలోచించు. చిన్నప్పటినుంచీ 'పెళ్లిచేసుకుందాం' అనుకుంటోన్న వాడి మేనమామకూతుర్ని, పదమూడేళ్లొచ్చి, చక్కగా ఎదుగుతోన్న పిల్లని చేసుకుంటే బాగుంటుందంటావా, లేకపోతే, మూడేళ్లపిల్ల, మీ అన్నకూతురు ఎప్పటికో, ఎదిగేదాకా కనిపెట్టుకోడం బాగుంటుందంటావా?"

భర్తనోటమ్మట వెలువడిన ఈమాటలు జానికమ్మ క్రోధానలానికి ఆజ్యధార లయాయి.

"ఆ! అలాగా? నాప్రయత్నం బాగుండలేదూ? ఒక్కమాటు వెనక్కి దృష్టిమరల్చండి! పదిహేనేళ్లక్రితం,—తమకి నలభయ్యయిదేళ్లుంటాయి అప్పటికి—"కృష్ణా, రామా" అనుకునే రోజులు దగ్గరపడ్డా, వచ్చి పద్ధానుగేళ్లపిల్లని నన్ను పెళ్లిచేసుకోడం బాగుందికాబోలు!"

ముసలాయనకు జానికమ్మదెప్పిపొడుపు చెప్పుదెబ్బలాగయింది. ఆతడికి ఉపద్రవమైన కోపంవచ్చింది. కాని అదృష్టవశాత్తు, దగ్గు అడ్డువచ్చి, ఆతడు కోపాన్ని వెలిబుచ్చకుండా చేసింది. అతడు నెమ్మదిగా "మీవాళ్లంత వెఱ్ఱిబాగులవాళ్లయి ముడిపెట్టలేదు నిన్ను నాకు. నాడబ్బంతా నీపేర బ్యాంకులో వేయించి మరీపెళ్లిచేశారు" అన్నాడు.

"రామం చేరినదికూడా ఆసొమ్ము కోసమే నాడబ్బుమీద ఆసక్తిఉండి చేరినవాడు నాచెప్పుచేతులలో పడిఉండాలి......"

జానకమ్మ క్రోధంలో ఉడికిపోతోంది. ఆవేశం చేత ఉచ్ఛ్వాసనిశ్వాసము లెక్కువై ఆమెవక్షస్థలం మాటిమాటికీ పొంగుతోంది. ఆమె పళ్లు 'పటపట'మని

కోఉకుతో, నిప్పులొలికే వదనాన్ని పైకెత్తి, "ఉండండి, వెధవల్లారా! మీపాట్లు ముందున్నాయి చూద్దురుగాని. మిమ్మల్నందర్నీ మంగలంలోపెట్టి వేచేస్తాను. పెద్దపులితోనా చెలగాటం మీకు?" అని అరిచింది.

శ్రీనివాసరా వదరిపడ్డాడు. ఉపనయనం కాని కుర్రవాళ్ళల్లో ఎదిగి పదిహేడేళ్ళొచ్చినవాడనీ, తన వృద్ధాప్యంలో చేతికందుతాడనీ రామాన్ని తీసికొచ్చి దత్తతచేసుకున్నాడు. నేటితో ఈపెంపకానికి విఘాత మొచ్చిందన్నమాట!

౨

"ఎవ రాతలుపుదగ్గర?" అంది జానకమ్మ లోపలి నుంచి.

"నేను." అనిహీనస్వరంలో సమాధానమొచ్చింది.

"రామం." అన్నాడు పంతులు.

జానకమ్మ చెయ్యి కడుగుకొని, సావిట్లోకి వచ్చింది. రామం తలవంచుకుని నిలువబడి, కాలి బొటనవ్రేలితో నేలమీద గీస్తున్నాడు. శ్రీనివాసరావు పంతులు రాబోయే పిడుగులవర్షాని కెదురుచూస్తున్నాడు.

"రామం!"

"ఊఁ!"

"తోటపల్లి కొండలకనిచెప్పి మమ్మల్ని మభ్యపెట్టి వెళ్లి పెళ్లిచేసుకుంటావా? నీపెళ్లి మేము చూడకూడదా ఏమిటి?" అతిశాంతముగా పలికినమాట లివి.

"మొదట నాకేమీ తెలియదు. దారిలో మా మామయ్యవచ్చి తీసికెళ్లేడు. మధ్యలో ఆసంగతీ, ఈసంగతీ చెప్పి, ఇంటికెళ్లేక పెళ్లిమాటెత్తేడు.

"ఊఁ?"

"'మాఅమ్మ. కిష్టంలేదు. అందుచేత నాకొద్దీపెళ్లి' అని చెప్పేను. 'ఫరవాలే'దని బలవంతపెట్టి చేసేశారు."

రెండునిమిషములు నిశ్శబ్దంగా గడిచేయ్.

"అమ్మ కిష్టంలేదని ఎందుకనుకున్నావూ ఈ పెళ్లి అంటే?"

రామారావు ముఖమెత్తి చూశాడుఆశ్చర్యంతో. భార్యవైఖరి పంతుల కర్థమవటంలేదు.

"నేనేదో వేళాకోళానికి శ్యామలని నీకు పెళ్లి చేస్తానంటే, ఆమాట పట్టుకుని, పెద్దపన్నాగం పన్ని నాకుతెలియకుండా పెళ్లిచేసేశారు నీకు. నాజన్మలో నేచేయదగిన ఈ ఒక్కశుభకార్యం, నాచేత జరుపబడకుండా ఉండకపోవడమేకాదు గదా నాకళ్లయెదుట కూడా జరుగనీయక—అంతేకాదు—నాకు తెలియనే తెలియకుండా జరిపేశారు. ఇంతకంటే దారుణం ఏముంది.?" జానకమ్మముఖంలో దైన్యం గోచరమయింది.

రామానికి కళ్లమ్మట నీళ్లొచ్చాయి. "అమ్మా, క్షమించాలి. దురభిప్రాయపడి చేసినపని ఇది."

"కళ్లమ్మట నీళ్లెందుకురా ఈమాత్రందానికి? నాకూ సంతోషమే కోడలొచ్చిందంటే......లే! నీళ్లుపోసుకో! వంట అయింది." అంటూ లోపలికి వెళ్లింది జానకమ్మ.

'రామాన్ని గుమ్మంలో అడుగుపెట్టేటప్పటికి పీకపట్టుకుని గెంటేస్తుంది జానకి' అని మొట్టమొదట అనుకున్న పంతులుకి, తనభార్యయొక్క సౌమ్యప్రవర్తన చాలా ఆశ్చర్యం కలిగించింది. 'ఏమైనా ఆడది, జాలిగుండెకలది.' అనుకుంటూ, ఆయన 'స్నానం చెయ్యరా, మడిగట్టుకుందాం' అన్నాడు.

3

శ్రీనివాసరావుకీ, జానకమ్మకూ తెలియకుండా రామాన్ని తీసుకుపోయి తనకూతుర్నిచ్చి పెళ్లిచేసిన గణపతిరావు, తాను చేసినసాహసం అతిప్రమాదజనకం అని అంతా అయినపిమ్మట ఆందోళనపడజొచ్చాడు. కాని ఈవిషయంలో జానకమ్మ చూపిన ఔదార్యాన్ని గురించి విన్నప్పుడు అతని హృదయభారం తగ్గింది. గయ్యాళి అనుకోబడే జానకమ్మ సాధుస్వభావాన్ని

గ్రహించినప్పుడాతడు పశ్చాత్తాపంతో చిన్నబుచ్చుకున్నాడు. తాను తొందరపడి ఆదంపతులకు చేసిన అపచారాన్ని వాళ్లు మరచిపోయేటట్లు చేద్దామనే ఉద్దేశంతో రాజమండ్రీవచ్చి పంతులుగారింటి కెళ్లేడు. 'పెళ్లి బంధువులెవళ్లూ రాకుండా జరిగిందిగనుక, ఏ సత్యనారాయణవ్రతం పేరోచెప్పి, చుట్టాలను సమావేశం చేయించి పిల్లని, పిల్లవాణ్ణి పీటలమీద కూర్చోపెట్టి ఆశీర్వచనం చేయిద్దాం' అని ఆతడు తనఉద్దేశాన్ని తెలియచేశాడు. పంతులుగారు 'బాగానేఉంది' అనుకున్నాడు. కాని జానకమ్మ 'జరిగినదేదో జరిగిపోయింది కదా. ఇప్పుడు తిరిగీ ఎందుకూ ఈతంతు? ముందు ముందు చేసుకోవలసిన కార్యాలు లేకపోలేదుగదా!' అని ముక్తసరుగా మాట్లాడి ప్రసంగాన్ని ముగించింది.

తలిదండ్రులు తనయెడల చూపిన క్షమ రామంలో మార్పు తీసుకొచ్చింది. నాటినుంచీ, తన్ను దత్తునిగా స్వీకరించినఆదంపతుల ఉద్దేశాలను గ్రహించుకుంటూ వాటి కనుకూలంగా ప్రవర్తించడం తనవిధి అని ఆతడు నిశ్చయం చేసుకున్నాడు. ఈమనోనిశ్చయం గాఢ మగుటకు తగినపరిస్థితులు కలిగేయి. శ్రావణమాసంలో తగువుఇవ్వడం, పండుగులకు పిలుపురావడంతోటే తన్ను పంపడం, బొమ్మలనోముకు సుభద్రను తీసుకు రావడం — ఈ విషయాలన్నింటిలోనూ ముందంజ వేస్తోన్న జానకమ్మయెడల తాను చూపవలసిన కృతజ్ఞత అనంతమైనదని ఆత డనుకోవలసివచ్చినది.

౪

సుమారు రెండుసంవత్సరాలు గడిచేయి. 'మీకోడలు, చిరంజీవిసౌభాగ్యవతి సుభద్ర రజస్వల అయినదని' గణపతిరావుదగ్గరనుంచి ఉత్తరం వచ్చింది.

మరినాలుగుమాసాలయాక, గణపతిరావు 'కార్యమెప్పుడుచేసుకుంటా'రని అడగటానికొచ్చాడు.

'ఇంకా కొన్నాళ్లు పోనియ్యండి' అంది జానకమ్మ. 'సరే, మీయిష్టం' అని గణపతిరావు వెళ్లేడు. రామం మామగార్ని సాగనంపుతో "మామయ్యా, నీనూటుకేసులో నాలుగుపుస్తకాలు పెట్టేను. దానికియ్యి" అన్నాడు.

'లెక్కలు బుర్రకెక్కటంలేదు. అంతేకాకుండా క్లాసుకి పెద్దవాణ్ణి నేను......'అన్నాడు రామం ఒకనాడు.

'ఈలెక్కలు మనల్ని ఉద్ధరిస్తాయి గనుకనా? స్కూలుమానెయ్యి. మునిగిపోయిందేమీ లేదు.' అంది జానకమ్మ.

రామాని కింక తీరుబడే. రెండురోజుల కొకనవల ముగించేవాడు ఇంట్లోకూచుని. వాఙ్మయం అంటే అభిరుచికలిగింది. 'నువ్వు బాగుగా చదువుకోవలెను.' అని సుభద్రకు జాబువ్రాశాడు. దానికి అత్తగారి భావాలతోనూ, సుభద్ర అక్షరాలతోనూ ప్రత్యుత్తరం వచ్చింది. కాలక్రమాన, తల్లికి తెలియకుండానే సుభద్ర మగనిఉత్తరాలకు సమాధానంవ్రాస్తోండేది.

సంవత్సరం గడిచింది. 'కోడల్ని తీసుకొస్తే బాగుంటుందేమోవే ఇంక' అన్నాడు పంతులుగారు.

శోభనం రాజమండ్రీలోనే జరిగింది. చాలా వైభవంగా జరిగింది. బాజారులో ఉన్న పట్టుచీరలలో మిక్కిలి విలువైనది కోడలికి కొనిపించింది జానకమ్మ. పన్నెండుపెద్దకాసులు కొంగున కట్టించింది.

"ఏమండీ!" అంది గణపతిరావుభార్య మగనితో.

"అల్లుణ్ని మనింటిదగ్గర మూడునిద్దర్లకీ పంపేటట్టుగాలేదు చూస్తే."

"పోనిద్దూ. ఆవి డిష్టమొచ్చినట్లు జరగనియ్యి. కొడుకుని తీసుకుని ఎక్కడకో వెళ్లాలంటోంది రేపు. మనకెందుకూ అనవసరమైన పట్టింపు?"

నాలుగోనాటి ఉదయం సుభద్రను వెంటబెట్టుకుని రామం అత్తగారు, మామగారు వెళ్లిపోయారు. 'నేనుగూడా వెడితే!' అనుకున్నాడు రామం. 'అమ్మ ప్రయాణమో!' అని మనస్సును సమాధానపరుచుకున్నాడు.

ఇంట్లో కార్యం అవటంవల్ల మూడురోజుల నుంచీ కలిగిన ప్రయాస జానకమ్మకి నలత కలుగ జేసింది. "నే నెక్కడకీ కదల్లేమురా. 'వంట్లో బాగుండ లేదుగనుక రావడానికి వీలులేకపోయింది.' అని వాళ్ల కుత్తరం వ్రాయి." అని జానకమ్మ ప్రయాణాన్ని ఆపుజేసింది.

౫

నెలయింది. 'మూడునిద్దర్లకీ రావలసిన' దని రామంమామగారిదగ్గరనుంచి ఉత్తరం వచ్చింది.

"కార్యం అయిందికనుక ఇంక మీమామగారు స్వయంగావచ్చి పిలవడం మానేసి, ఉత్తరాలమీద వ్యవహారం నడపటం మొదలెట్టేరు. చూశావ్!" అంది జానకమ్మ కొడుకుతో.

"ఏమిటో, మేనల్లుణ్ణిగదా అనే చనువుతో వ్రాశాడు. తీరికలేకపోయింది కాబోలు. లేకపోతే వచ్చేవాడే."

"మేనల్లుడవుతే లోకువచెయ్యాల్లేమిటి? ఉత్తరం వచ్చినంతమాత్రాన్ని వాళ్లింటికెళ్లి కూర్చోక్కర్లేదు మనం. మాట్లాడ కూరుకో. సమాధానం కూడా వ్రాయకు."

రామం, "అమ్మ కీచిన్నవిషయంలో ఇంత పట్టింపెందుకో?" అనుకున్నాడు.

మరొకనెల గడిచింది. 'వాళ్లలాగ మనం ఉపేక్ష చేస్తే ప్రమాదంరావచ్చు.' అనే ఉద్దేశంతో సుభద్రను తీసుకొచ్చి, అత్తవారింట దిగబెట్టేడు గణపతిరావు.

"రామం, తాడేపల్లిలో ఇల్లు ఒక్కవర్షంవస్తే కూలిపోయేలాగుందిట! మనం అశ్రద్ధచేస్తే అదికాస్తా జరిగిపోతుంది. పట్టుమని వారంరోజులపని ఉండదు. వెళ్లి ఆఇల్లుకాస్తా బాగుచేయించిరా నాయనా!" అంది జానకమ్మ ఆనాడే.

'నెలో, రెండునెలలో మకాంచేసి, పూర్తి చెయ్యవలసిన ఇంటిపని వారంరోజులలో ఎలాగ అవుతుంది? ఇంతకీ, అమ్మకి ఇంటితలపు ఈనాడే వచ్చిందెందుచేతో?......ఏమైనాసరే, నేను వెళ్లకతప్పదు.' అనుకుని బయలుదేరేడు రామం. అనుకనిపెట్టి, భార్య దగ్గిరకెళ్లి, 'త్వరగా వచ్చేస్తాలే' అనిచెప్పి, రైలు కెళ్లిపోయాడు.

'చీటికీ మాటికీ ఇంటికిరాకుండా, పనిముగించి మరీరావలెను' అని ఇంటిదగ్గరనుంచి ఉత్తరం వచ్చింది రామానికి. 'సరే' అని ప్రత్యుత్తరం వ్రాసాడు.

మాసాంతమయేదాకా రామారావు రాజమండ్రీ రాలేకపోయాడు. నిరీక్షిస్తో కాలంగడుపుతోన్న సుభద్రకి తుదకు భర్తృదర్శన మయింది.

భోజనాలయాయి. "నాలుగు రోజులనుంచి అనుకుంటున్నా, 'పని పూర్తిఅయినా కాకపోయినా బయలుదేరి వచ్చెయ్య' మని ఉత్తరం వ్రాద్దామని. మావాళ్లు ఉత్తరంమీద ఉత్తరం రాస్తున్నారు నన్ను రమ్మని" అంది జానకమ్మ రామంతో.

"ఎప్పుడో నెల్లాళ్లతర్వాత కాబోయేపెళ్లికి ఇప్పటినుంచి ఎందుకూ వెళ్లడం?" అన్నాడు పంతులు.

"పెళ్లినాటికి సరిగ్గా అందరిచుట్టాలలాగ్గా నేను వెడితే వాళ్లకేమి లాభం? మాఅమ్మ ఒక్కత్తేకదా! పనిపాటల్లో కాస్త ముందుగావెళ్లి దానికి సాయపడకపోతే ఎలాగ?"

"కోడల్ని కూడా తీసికెడతావా అలాగైతే?"

"అంతా అక్కడికిపోయి కూచుంటే ఇక్కడ మీకు భోజనమో?"

"సరే, అలాగైతే నరేంద్రపురంలో దిగబెట్టి రారా అమ్మని" అన్నాడు కొడుకుతో శ్రీనివాసరావు.

"దిగబెట్టివస్తే ఎలాగ కుదురుతుంది? ఏమి కావలసివచ్చినా పిలిస్తే పలికేవా డుండాలా. నాకక్కడ? ఎంతకాలం? ఒక్కనెల్లాళ్లే కామా? పెళ్లి అయిపోడంతోటే వచ్చేస్తాం!" అంది జానకమ్మ.

పంతులు నిర్ఘాంతపోయాడు. రామారావునకు వెన్ను విరిగినట్లయింది.

మర్నాడు జానకమ్మ రామారావుతో నరేంద్రపురం వెళ్లింది.

శ్రీనివాసరావుపంతులుకూడా ఒకప్పు డిరవై యొక్క సంవత్సరముల వయస్సుగల యువకుడే. తనతో కాపురంచెయ్యడాని కొచ్చిన తనప్రథమకళత్రాని కప్పటికి సరిగ్గా సుభద్రలాగ పదహారేళ్లే ఉన్నాయి. కనుక ఆవయస్సులో నూతనదంపతులయొక్క భావాలెల్లా గుంటాయో ఆతని కెరుకరయే. శోభనమైనదిమొదలు భర్తనుంచి ఎడబాటుచేయబడుతోన్న సుభద్రను చూస్తే ఆవృద్ధుడు వేదనకు లోనయాడు. మగడు దూరంగా ఉండడంచేత, ఆయింట్లో పిలిస్తే పలికేవాళ్లికొకళ్లు లేకపోవడంచేత, కోడలు బెంగపెట్టుకుంటుందని ఆలోచించి, ఆమెను పుట్టినింట దిగబెట్టి వచ్చి హోటల్లో ప్రవేశించాడు.

భార్యప్రవర్తనలో హఠాత్తుగా అగుపించిన ఈ మార్పునకు కారణమేమిటో? ఎడబాటువలన ఆయువతీయువకుల హృదయాలలో పుట్టే సంక్షోభానికి తాను కారకురాలనని జానకి గుర్తిస్తోందా? పెండ్లి అయిన వెంటనే, రజస్వలకాకపూర్వమే తనతో కాపురం చెయ్యడానికొచ్చి, ఒకరోజుకూడా తన్ను విడిచిఉండని జానకికి విరహవేదన అంటే ఎలాగ తెలుస్తుంది? తనకీ ఆమెకూ వయస్సులో విశేషభేదముందనిన్నీ, ఆమెకు దాంపత్యసౌఖ్యం పూర్తిగా లభించలేదనీ శ్రీనివాసరావిప్పుడు ఒప్పుతాడు. అందుచేత జానకి, తెలుసుకోకుండా ఆపుత్రవాళ్లకి అపచారంచేస్తోందేమో అనుకున్నాడు. 'కాని ముప్ఫయ్యేళ్లది. ప్రపంచంలో ఎందరో దంపతుల్ని చూస్తోంది. ఆమాత్రం తెలియకపోతుందా?' అనే సందేహం పీడించింది. కనుక ఏదో ఓగొప్పకారణం ఉంది దీనంతకీ...ఏమైతేనేమి, తనకి పెత్తనం నశించింది. తాను ప్లీడరీచేసి గడించిన ఆసొమ్మంతలోనూ ఒక్కకానీ ముట్టుకోడానికి తన కధికారంలేదు.

౬

"అందుచేత మీఅమ్మ నామీద కసి తీర్చుకుంటోందన్నమాట! ఈరెండుసంవత్సరాలు చూపిన ఆదరణ, ప్రేమా అంతా నటనేనా?"

"అనే అనుకోవాలి."

"నామీద కక్షకట్టి నన్ను మీసుమ్మం తొక్కకుండా చెయ్యవచ్చు. ఏమీ ఎరగని సుభద్ర నెందుకూ ఏడిపించడం?"

"ఇద్దరురాజులు యుద్ధానికి దిగినప్పుడు, మధ్య నిరపరాధు లెందరు నశించటంలేదూ?"

"మీనాన్నకైనా జాలి అనేదిలేదూ?"

"ఉండి ఏమిచేయగలడు? ఆజాలి అనేది ఉండటంవల్లనే నామూలాన్ని ఆ దంపతులలో కలహాలు బయలుదేరుతున్నాయి. 'లేని ప్రేమ నటిస్తే, వాడికి శోభనంచేసి, తుదకు అన్యోన్యానురాగం కుదిరిన వాళ్లిద్దర్నీ ఎడబాటు చేస్తోన్న గోముఖవ్యాఘ్రానివి. నీవు బ్రహ్మరాక్షసివి కాని మనిషివై పుట్టవలసినదానివి కావు. నీవు ఎరుగుండి, పట్టుదలతో పూనుకున్న ఈ మహాపాతకానికి ఫలితంక్రింద మళ్లీ జన్మలో ఘోరమైన వైధవ్యం సంభవిస్తుంది నీకు' అని తిట్టేడు. ఈ జన్మలో నా కంతకంటే ఎక్కువ వెలిగిపోతోన్నదేమీ లేదు' అని సమాధాన మిచ్చింది."

"డబ్బు చేతికిచిక్కిందికదా అన్నపొగరు. లేకపోతే ఆడ దల్లాంటి సమాధాన మివ్వగలదా?"

"..................."

"ఇన్నాళ్లనుంచి అక్కడ పెరుగుతో, ఎంతో అడకువతో ప్రవర్తిస్తోన్న నీకుకలిగిన ప్రతిఫలమేమిటి?"

"ఇంతవరకూ ఏమీ లేదన్నమాట."

"అట్లయితే పరాయివానిలాగేనా ఉండడం నువ్వాయింట్లో ఇప్పుడు? ప్రపంచంలో దత్తత యియ్యబడ్డవాళ్లంతా ఇటువంటి అవస్థకే లోనవుతున్నారా?"

"లేదు. శైశవంలో పెంపకంయియ్యబడ్డ పుత్రవాళ్లు తమఆటపాటలచేత అన్యగర్భవాసులైనా దత్తత తల్లిహృదయాన్ని ఆకర్షిస్తారు. అంతేకాకుండా, సాధారణంగా దత్తతచేసుకోబడ్డ పుత్రవాళ్లు ఏఅన్నకొడుకులో, తమ్ముడుకొడుకులో అయిఉంటారు. నాకూ, వీళ్లకూ అట్టి సంబంధమేలేదు. స్వశాఖలో

వాణ్ని, వసువుకానివాణ్ని గనుక దత్తత పీలైంది. అయినప్పటికీ నామీద ప్రేమకలగడానికి వీలులేక పోలేదు. నామీద అటువంటి ఆదరణకూడా చూపేరు వాళ్లు. మానాయన నామీద ఎప్పుడూ అట్టిప్రేమ చూపుతోనే ఉన్నాడు. అమ్మకు నామీద కలుగవలసిన ప్రేమకు విఘాతమొచ్చింది. అందుకు కారణం మనమే."

"ఆమెకు చేసిన అపచారాన్ని గురించి పశ్చాత్తపుల మయాము కాదూ, ఎన్నివిధాలనో? ఆమెచెప్పినట్లు చేశాం. అతివినయంతో ప్రవర్తిస్తున్నావు నువ్వు. ఇట్టిపరిస్థితుల్లో ఇంకా ఎందుకూ ఈకసి? ఈ జన్మలో క్షమించడం అంటూ ఉండదా ఏమిటి?"

"ఉండకపోవచ్చు. ఆమె క్షమించాలని మనమెందు కనుకోవాలి? మన మామెకొనర్చిన మహాపచారానికి మనకు కావలసిన ప్రాయశ్చిత్తము చాలా ఉంది. ఆమెను తల్లి అని సలహాచేయకుండా ఆమెకు తెలియకుండా స్వతంత్రించి వివాహం చేసుకున్నప్పుడు ఆమె నన్ను పుత్రునిగా ఎలాభావిస్తుంది? ఇదేమీ గర్భవాసం కాదుగదా, కొడుకేమి చేసినా ఊరుకోడానికి?"

గణపతిరావునకు మనోవేద నెక్కువవుతోంది. అల్లుడుకూడా తనమీద సానుభూతి చూపడం మానేస్తున్నాడు.

"వ్యవహారం పూర్తిగా చెడిపోయిందని తెలుసుండి ఇంకా ఎందుకూ ఆయింట్లో ఊగులాడడం?"

"వేరు దిక్కులేక!"

"దిక్కులేకేమి? నీతల్లిదండ్రులు బ్రతికున్నారు. నీఅన్నదమ్ము లున్నారు. నీకేమిలోటు? నీవాటా నీకివ్వకపోరు."

ఆమాటలువిని ఉగ్రుడయిపోయాడు రామారావు. "నన్ను దత్తుడని పేరుపెట్టి ఈ దంపతులకు విక్రయించిననాడే నాతలిదండ్రుల కాత్మహత్య సంభవించింది. వీళ్లింటికొచ్చి, వీళ్లప్రేమ సంపాదించుకోడంచేత కాక, వీళ్లను నే చంపుకున్నాను. అన్నదమ్ములని పేరుపెట్టుకొని ఆఊరువెడితే, 'దత్తత ఇచ్చి వదుల్చుకో ప్రయత్నించినా, పిశాచంలాగ మళ్లీ వచ్చా'డని వాళ్లుమాత్రం ఏవగించుకోరూ? అందుచేత అక్కడకువెళ్లినా దయాధర్మభిక్షుమే. స్వతంత్ర జీవనానికి తగినవిద్యలేదు. లక్షాధికారివనే ఉద్దేశంతో అశ్రద్ధచేసి మానేశాను......కనుక కర్తవ్య మేమిటంటే ఎప్పటికైనా వస్తే దయ ఈమెకే రావాలనే ఆశతో ఇక్కడే కనిపెట్టుకుండాలి."

"ఎంతవరకూ?"

"అవసరమవుతే జీవితాంతంవరకూ!"

"సుభద్రగతి ఏమిటి?"

"నే చేయగలిగిన దేముటో చెప్పు. దానిమీద నాకున్న ప్రేమ నిష్కళంకమైనదనుటలో సందేహాము లేదు కదా!"

"అయితే, మాయింటికొచ్చెయ్."

"నేడబ్బున్నవాణ్ని అనే ఉద్దేశంతో, ఇంకా మేనల్లుళ్లు, నీకూతుర్ని కళ్లనద్దుకుని పెళ్లిచేసుకునే వాళ్లు చాలామందున్నా, నాకే ఇచ్చి దొంగతనంగా పెళ్లిచేశావు. లక్షాధికారినని ఉద్దేశింపబడ్డ నేను అక్షయపాత్రతో నీయింటి కెట్లు రాగలను?...... ఏధనం నాదత్తతకీ, వివాహానికీ, మా అమ్మకక్షకీ, నా దౌర్భాగ్యానికీ కారణమయిందో, ఆధనాన్ని ఇక్కడేఉండి సాధిస్తాను."

గణపతిరావు కన్నీరు తుడుచుకుంటూ తిరిగి వెళ్లిపోయాడు.

౨

"నేను నిర్భాగ్యుడను. అపరాధిని. అందుచేత నాకుకలిగిన సిలుగులను ధైర్యంతో సహించాలి. కాని సుభద్రమాట!" ఇట్టితలపులు రామంమనస్సును తరుచుగా కలతపెడుతోండేవి.

"అమ్మ, తనకు 'సుభద్ర అనే కోడలుంది' అనే విషయమే తెలియనట్లుగా ప్రవర్తిస్తోంది. 'అమ్మా,

మీకోడల్ని తీసుకురానా?' అని అడుగుతే ఏమంటుందో? ఏమంటుంది? 'సరే' అని. సుభద్ర వీథి గుమ్మంలో అడుగుపెట్టేటప్పటికి, 'అబ్బాయ్ ప్రయాణం' అంటుంది. అప్పుడు చెయ్యవలసినపని! కేవలం ముసలాయనకు వంటచెయ్యడంకోసం సుభద్రను తీసుకొచ్చినట్లవుతుంది. ఏదో ముక్కో, చెక్కో కింప తేల్చుకోడానికి 'నేను సుభద్రతో కాపురంచెయ్యడం ఇష్టంలేదా నీకు?' అని నిక్కచ్చిగా అడుగుతే?...... ఎందుకూ అడగడం, ఆమెఅభిప్రాయం ఎరుగుండీ కూడా? 'నాకు ఇష్టంలేదు' అని ముఖంమీద అనేస్తే ఉన్నగోటు రవంతా చెడిపోతుంది."

తనకు కార్యమై ఏడాదికావస్తోంది. కాని ఆతడు ముచ్చటతీరా పట్టుమని పదిరోజులు భార్యతోకలిసి ఉండలేదు. గతజన్మలో ఏదంపతుల అనుకూలదాంపత్యానికి విఘాత మేర్పరిచాడో కాని దారుణమైన ఫల మిప్పు డనుభవిస్తున్నాడు.

సుభద్రారహితమైన జీవితం సుఖప్రదమైనది కాదు. అప్పు డీఘనరాసులవల్ల ప్రయోజనం మృగ్యం. కనుక అమ్మనూ, ఆమె ఫిక్సెడ్ డిపోజిట్లనూ ఒకసలాము కొట్టి వెందుకుపోరాదూ?

తొందరపడకూడదు. జానకమ్మ హృదయం ఎంతకఠినమైనా, మానవహృదయమే. తన విధేయతను పరీక్షిద్దా మని చేస్తోందేమో ఇలాగ? కాని, అగ్నిహోత్రంకంటె దారుణమైన దీపరీక్ష. అయితే నేమి? ఈఘాక్కకు ఆగడానికి ప్రయత్నించాలి.

సరే,అలాగైతే కొన్నాళ్లు ఓపికపట్టాలి. 'మధ్య మధ్య అమ్మకి తెలియకుండా, ఏదో వంకపెట్టుకుని, సుభద్రని చూసివస్తూంటే!' ఈతలపాయువకుని హృదయంలో ఓవెన్నెలరాత్రిని మెలగింది. పాపం ఆతడు మనస్సు తక్షణమే చిక్కబట్టుకున్నాడు. అమ్మకి తెలియకుండా సుభద్రను పెళ్లిచేసుకోడం ప్రథమ తప్పిదం. ఇప్పు డమ్మకి తెలియకుండా సుభద్రను కలుసుకోడం రెండో తప్పిదం అవుతుంది. అది కూడదు. ఆ తలపు తనమనస్సులోనికి చొరనీయరాదు.

జనకతండ్రిమో, అన్నగార్లో, మామగార్లో, ఎవళ్లోఒకళ్లు, ఇంటికి రాకపోయినా ఏ బజారులోనో ఉండి, ఎవరిచేతో రహస్యంగా కబురుచేసి రామానికి 'ఈబ్రహ్మరాక్షసిని వదిలించుకో' అని బోధించేవారు. ఈరహస్యప్రవర్తన రామానికి నచ్చేది కాదు. వాళ్లు తన్ను కలుసుకుని మాటలాడినప్పుడల్లా తనకు మనస్సంక్షోభం కలగడంతప్ప, ప్రయోజనం ఏమీ అగ్గుపడటంలేదు. అందుచేత, సాధ్యమైనంతవరకూ వాళ్లని తప్పించుకు తిరిగేవాడు. ఇతణ్ణి కలుసుకు మాట్లాడ్డానికి ఏదో ఒకపన్నాగం పన్నవలసొచ్చేది. ఏదో విధంగా ఇవన్నీ జానకమ్మ గ్రహిస్తోండేది. విషపునవ్వుల దెప్పిపొడుపులతో 'మీవాళ్లేమి చేస్తోన్నదీ నాకు తెలుసు!' అనే భావాన్ని తెలియజేస్తోండేది ఆమె. అందుచేత తనవంపుచుట్టాలు ముఖాముఖీ అయినప్పుడుకూడా తప్పించుకుపోయేవాడు రామం.

౮

దినాలు నెమ్మదిగా గడచిపోతున్నాయి. రామారావు తన్నుపెంచుటకని తెచ్చిన ఆదంపతులయొకల నిరుపమానమైన విధేయత చూపుతోనేఉన్నాడు.

రామారావునుసటించి పంతు లమితమైన వేదనకు లోనయేవాడు. 'తలితండ్రులసమ్మతి లేకుండా జరుగుతోన్న వివాహాలు ప్రపంచంలో ప్రతీదేశంలోనూ ఉన్నాయి. ఇటువంటి కసితీర్చుకోడం మాత్రం ఎక్కడాలేదు' అనుకునేవాడు. తానప్రయోజకుడని తెలిసికూడా జరుగుతోన్న దారుణాన్ని చూసి ఉరుకోలేక భార్యమీద మండిపడేవాడు. ఆమె వికటమందహాసంచేసి 'నాడబ్బుకోసం గాని నన్నుద్ధరించడానికి కాదు ఈవినయం!' అనేది. రామారావు మహాపరాధం జరిగించనే పశ్చాత్తాపంతో కుమిలిపోతో, జానకమ్మను ఏదోవిధంగా సంతుష్టిపరచాలనే గమ్యస్థానం పెట్టుకుని, కోరిచేసుకున్న భార్యనుండి కూడా వియోగాని కొడబడి త్యాగంచూపిస్తోంటే, తనడబ్బుకోసం నక్కవినయాన్ని కనపరుస్తున్నాడనే తలంపుతో, ప్రమత్తతవల్ల గుండెక్కరిగి, కరుణాలేశమొకటి ఆతణ్ణి జేరుతుం

దేమో అనేభయంచేత హృదయాన్ని మాటిమాటికి ఘనీభవింపజేస్తోందేదామె. ఆతడు, తనధనంకోసమే చేరి అడకువ చూపిస్తున్నాడనుకున్నా, అంతకాఠిన్య మెందుకో? కడుపుకక్కుర్తిచే చేరిన సేవకుణ్ని లాగ చూసినా ఆతడు దయనీయుడేకదా!

ధనవంతురాల ననే అహంకార మామె నావ రించింది. ఆమెహృదయం అయఃపిండము. అందు దయ, సానుభూతి అనేవాటికోరకు వెతకడం అవివేకం. రామారావుయొక్క అభాగ్యజీవనం ఆమెకు కన్నులపండుగ. సుభద్రకన్నీటినిగూర్చి తెలియజేయు హృదయనిర్భేదకమగు పలుకు లామెకు శ్రవణానందకరములు. గణపతిరావుమనోవేదన ఆమె కాహ్లాదకరము. పంతులుగారి ఒడలిమంట ఆమెకు బాణసంచావంటిది.

౬

ఆనాడు రాజమహేంద్రవరం కలకలలాడుతోంది. మ్యునిసిపల్ ఆఫీసులో గవర్నరునకు స్వాగత మివ్వటానికి ఏర్పాటు జరిగింది.

శ్రీనివాసరావుపంతులుకు ఆహ్వాన మొచ్చింది. ముసలాయన ఆల్పాకాకోటు బూజుదులిపేడుఆరోజున.

పంతులు వ్యాజియంతోటలలోంచి తిరిగివచ్చి సోఫాలో కూలబడ్డాడు. "ఏమిటివిశేషాలు నాన్నా" అన్నాడు రామం.

ఆతనికి ముసలాయినముఖంలో విషాదం అగుపించింది.

"ఏమండీ, ఎండలో తిరిగివస్తే నిస్త్రాణ చేసినట్లుగా ఉంది. కాఫీ పుచ్చుకుంటే?"

రామారావు అడిగినదానికి సమాధానం చెప్పకుండానే పంతులు, "మీామామగా రగుపించాడురా, బజారులో. ఇంటికిరమ్మంటే వచ్చాడుకాదు."

రామారావు మాట్లాడలేదు.

"నాప్రథమభార్యకు జనించిన సంతానమంతా పెరిగి పెద్దవాళ్లవకుండానే పోవడంచేత, పుత్రశోకమంటేనే నాకు తెలుసుకాని, వాళ్లు ఎదిగి కష్టాలుపడుతోంటే తలిదండ్రులకు కలిగేబాధ నాకంతగా స్వానుభవంకాదు. కాని ఈరోజున గణపతిరావును చూస్తే, ఆవేదన అవగాహనఅవుతోంది. అబ్బ! ఆడపిల్లని కన్నవాడిబాధ దారుణమైనదన్నమాట. కొడుక్కి కోడలితో అనుకూలదాంపత్యం కుదరకపోతే పునర్వివాహం చేసి, ఆబాధ నంతంచేసుకుంటాడు మగపిల్లవాని తండ్రి. కూతురుకాపురానికి విఘాతమొచ్చినప్పుడు తండ్రిపడే పరితాపం అనంతమైనది."

రామారావు మాట్లాడలేదు. ఆతని మనస్సులో అణచివేయబడ్డ భావాలన్నీ స్వతంత్రించి పైకొచ్చి, మనస్సును కలచివేస్తున్నాయి.

పంతులుకూడా కొంతసేపటివరకూ మాటలాడలేకపోయాడు. ఆతనిమనస్సులోకూడా గొప్ప సంక్షోభం బయలుదేరింది. ఆత డాయువతీయువకులకు| కలిగిన ఎడబాటుచూసి సహించలేడు. మహాదారిద్ర్య మనుభవింపవలసివచ్చినాసరే, రామారావు తక్షణం ఆయిల్లు వదలి వెళ్లి, సుభద్రను కలుసుకోవాలి. పాపం, ఆ పిల్ల బెంగపెట్టుకుని మంచం పట్టిందట! పదిరోజుల క్రితం ఆసంగతి తెలియజేస్తూ గణపతిరావువ్రాసిన వుత్తరాన్ని తనభార్య—తనభార్యకాదు, తన ధనాన్ని వెచ్చించి కొనితెచ్చుకున్న పెనుభూతం — 'టక్కరి వేషం' అంటూ చింపిపారవేసింది! తమ్ము వదలి వెళ్లిపోవడం రామానికి క్షేమకరం అని తెలిసికూడా, ఆవృద్ధుడు తనఉద్దేశాన్ని తెలియజేయలేకపోయాడు. 'ఉద్ధరిస్తాం' అనిచెప్పి, పెంపకానికి తీసుకొచ్చిన కుర్రవానితో 'వెళ్లు' అని అనడం ఎలాగ?

"చిలకాగోరింకల్లాగ ఉండి సుఖంగా జీవితం గడుపదగిన మీాదంపతుల సంసారంలో నిష్కారణంగా ఉపద్రవం సంభవించిందే అని ఏడుస్తున్నా" అన్నాడు పంతులు.

రామారావు పంతులుకేసి చూశాడు. ఆయన కండ్లు నీటితోనిండేయి.

"నాన్నగారూ, ఎందుకండీ ఈవిచారంఇప్పుడు? జీవితెప్పుడూ సుఖంఅనేది లేదు. ఆతడు తెలివైన వాడై చేయవలసిన దేమిటంటే, తన కందరానిసుఖాల నన్నింటిని పరిత్యజించి, ఓరిమివహించి, మనస్సును సమాధానపరుచుకోవాలి. ఈరీతిగానే, నేను ఈరెండు సంవత్సరాలనుంచీ, నాహృదయానికి శాంతి నెలకొల్ప కలిగేను."

"అబ్బాయి, వెఱ్ఱివాడవై నిన్ను నువ్వే మోసగించుకుంటున్నావు. అనివార్యమైన వేదన కలిగినప్పుడు, అన్యమార్గం లేదుకనుక అప్పుడు 'ఓర్పు' అనేదే శరణ్యము. అట్టిబాధను హృదయపూర్వకంగా సహించటం యుక్తమే. కాని మీావియోగదుఃఖము ఇతరులవల్ల కలిగినది కనుక అనివార్యమైనది కాదు. మీాదాంపత్యము వలన కలుగవలసిన సుఖం నీకందరానిదికాదు. ఎన్నటికైనా మీాఅమ్మ నీవిధేయతవలన సంతుష్టి చెందుతుందేమో అనే తప్పుఅభిప్రాయాన్ని ఊతగాపుచ్చుకుని కాలాన్ని గడుపుతున్నావు. ఈఅభిప్రాయంతో, సహజంగా హృదయంలో ఉప్పొంగివచ్చే అనురాగాన్ని అణిచివేస్తున్నావు. ఎడబాటువల్ల కలిగే బాధని బలవంతంగా దిగమ్రింగుతో, 'ఇది సహనము' అనుకుంటూ మోసపోతున్నావు. నీవు 'ఓరిమి' అనుకుంటూన్నది, అమ్మను సంతోషపెట్టాలనే పట్టుదలవల్ల శరీరంలో కలిగిన మైకము. మైకమనేది శాశ్వతంగా ఉండదు. ఆమైకము పోవడంతోటే, నువ్వు 'ఓర్పుతో అణచుకున్నాను' అనుకునే బాధలన్నీ ఒక్కమాటుగా విజృంభించి ద్విగుణీకృతమై అగుపిస్తాయి నీకు."

రామారావుకు, తన్నావరించుకొనియున్న జడత్వంయొక్క స్వరూపం చిత్రింపబడింది. ఆత డొక దీర్ఘనిద్రలోంచి మేల్కొంచినట్లుగా భావించాడు. తండ్రికి దగ్గరగా జరిగి, తడబడే మాటలతో "నాన్నగారూ, నన్నేమి చేయమన్నా రిప్పుడు?" అన్నాడు.

"ఈక్షుద్రదేవతారాధనకు స్వస్తిచెప్పి, ఈఇల్లు వదిలి, మాణిక్యంలాంటి నీభార్యను తీసుకుని, ఏపల్లెటూరో పోయి జీవనం చెయ్యి—"

రామారావు తక్షణమే లేచాడు. "సరే, నాకు సెలవు దయచెయ్యండి" అన్నాడు.

"నాయనా, పుట్టిన తలితండ్రులతోటీ, అన్నదమ్ములతోటీ పెరగనియ్యకుండా, పెంపకం అని తీసుకొచ్చి 'భాగ్యవంతుణ్ణి!' అనే అభిప్రాయాలు నీలో కలుగనిచ్చి, ఇంతకాలం వెట్టిచాకిరీ చేయించుకుని, తుదకు ఈరీతిగా నిన్ను పంపిస్తున్నా. 'ధనవంతుణ్ణి' అని ఒడలు తెలియక, పునర్వివాహం తలపెట్టి కష్టార్జితవిత్తాన్ని ధారపోసి బానిసత్వాన్ని అంటగట్టుకున్న నాకు ఈజన్మలో నీ ఋణాన్ని తీర్చుకోటాని కవకాశం లేదు. నాయనా, ఈ పాపాత్ముని కి నిన్ను క్షమించమని వేడుకోటానికికూడా హక్కు లేదు."

"నాన్నగారూ, మీారు విచారించవద్దు. ఈ నాలుగుసంవత్సరాలలోనూ మీారు నాక్షేమమే కోరుతో నాపైన చూపిన అవ్యాజానురాగము నాలో మీాయందు పితృభావాన్ని కలుగజేసింది. 'మీాదంపతులలో ఒకరు నన్ను పుత్రునిగా భావించారు' అనే తలపు నేనిప్పు డుత్సాహంతో వెళ్లడానికి తగిన కారణ మవుతోంది."

రామారావుపలుకు లాయనకు మరింత వేదన కలుగచేశాయి. ఆవృద్ధుడు కుర్రవానివలె ఏడవడంమొదలెట్టేడు.

లోపలినుంచి జానకమ్మ వచ్చింది. "నే వెళ్లివస్తా మరి" అంటున్నాడు రామారావు.

"ఎక్కడికిరా ఇప్పుడు?" అంది జానకమ్మ. పైమీాద గుడ్డకూడా లేకుండా వెడదాం అని నిశ్చయించుకున్న రామారావునిచూస్తే, ఊరుప్రయాణమని ఎవరూ అనుకోడానికి వీల్లేదు.

"ఎందుకండీ. ఆకళ్లమ్మట నీళ్లు, ఎవరో చచ్చినట్లు?" అంది జానకమ్మ మొగుడుకేసి చూసి.

"ఎవరో చచ్చారనికాదు ఏడుస్తోంటు, నే చావలేకనే!" అన్నాడు ముసలాయన.

ఉంటే, ఇంకా ఎలాంటి మాటలు వినవలసొస్తుందో అని, రామారావు మాటలాడకుండా అక్కడ నుంచి వెళ్లిపోయాడు.

సందుతిరిగి మెయిన్‌రోడ్డు కొచ్చాటప్పటికి తల వంచుకుని అటూ ఇటూ నడయాడుతోన్న గణపతి రావు అగుపించాడు.

"మామయ్యా!"

"నీతో కలిసి మాట్లాడితే ప్రయోజన ముంటుందేమో అనివచ్చి, ఎందునిమిత్తమేనా ఇటు వస్తావేమో అని చూస్తున్నా."

"రైలుకు వేళవుతోన్నట్లుంది."

గణపతిరావు అల్లుడు తనకు రైలుకు వేళ అవుతోందని చెప్పడంలో 'మాట్లాడక్కర్లేదు. త్వరగా దయచెయ్యి'మని సూచిస్తున్నాడేమో అనే సందేహానికి లోనై 'సుభద్రకి చాలా జబ్బుగా ఉంది. నిన్నొక్కమాటు తీసుకెళ్లి చూపిద్దామని వచ్చాను.' అన్నాడు.

"అవును. నడిచివెడితే స్టేషను కందుకోలేము." అంటూ జట్కావాణ్ని కేకలేశాడు రామారావు.

"ఎక్కండి."

గణపతిరావువెనకాల అల్లుడు బండిలో కురిచేడు.

"ఇలాగే వచ్చేస్తున్నావేమిటి?"

"ఇంతకంటే కూడా తెచ్చుకోడాని కే ముందిక్కడ నాకు?"

౧౦

"అమ్మా, నాన్న రాలేదు టే?"

"వస్తారమ్మా, ఏదీ, ఇంకా రైలు వచ్చేవేళ అవందే."

"ఆయనకూడా వస్తారంటావా?"

"అతణ్ని తీసుకురావటానికే కాదూ మీనాన్న వెడత? తప్పకుండా వస్తాడు రామం ఈమాటు" అంది సుభద్రతో తల్లి. కాని 'ఆతడు వస్తాడా' అనే సందేహం ఆమెకూ కలిగింది.

"అమ్మా, పూర్వజన్మలో నేను మాఅత్తగారికి అత్తగారి ననుకుంటా. అప్పుడు నావల్లపడ్డ బాధలకి ఇప్పు డావిడ కసితీర్చుకుంటూంది కాబోలు."

"అమ్మాయి, నువ్వు మాట్లాడక పడుకోవాలి. ఇందాకా చూశావా, ఆయాసం వచ్చింది! కాస్తసేపు నిద్రపో."

"మామగారితో చెబితే, ఆయన్ని ఒక్కమాటు ఇక్కడకు వచ్చేటట్లు చేస్తారుసుమా. నాన్నతో అలాగ చెప్పలేకపోయావా?"

"చెప్పేను. నాన్న తప్పకుండా తీసుకొస్తారు రామాన్ని. ఈరైల్లో వచ్చేస్తూంటారు ఈపాటికి."

సుభద్ర లేచికూచుంది మంచంమీద. "అమ్మా, ఆయన వచ్చినప్పుడు డాక్టరుగారిని రాకుండా చెయ్యాలి."

"ఏ?"

"నన్ను ఆయనతో మాట్లాడనియ్యరు డాక్టరుగారు!"

"సరేలే చూడొచ్చు. మందుకి వేళయింది. రెండో మోతాదు పుచ్చుకోవూ?"

"అమ్మా, నాకు మందక్కర్లేదే. చాలా తేలిగ్గా ఉంది వంట్లో."

"మందుచ్చుకోడంచేతే తేలికగా ఉంది. ఆ మోతాదుకూడా పుచ్చేసుకో."

"అమ్మా, నీకు ఏపిచ్చిపట్టుకుంటేఅదేనే! నాకు ఈవేళనుంచి మందక్కర్లేదు. నారోగం కుదిరిపోతేనే!"

"వద్దంటే లేచికూచున్నావు మళ్లీని. ఇదుగో మందు; తాగిపడుకో."

సుభద్ర మందుతాగి పడుకుంది. "అమ్మా, ఒళ్లంతా చెమట పడుతోంది. ఏమిటో తాపంగా ఉంది" అంటూ ప్రక్కమీద అటూఇటూ దొర్లడం మొదలెట్టింది.

తల్లికేమీ తోచటంలేదు. సుభద్రకి తాపం ఎక్కువవుతోంది, తటాలున వీథిలోకెళ్లి, దాసీదాన్ని

పిలిచి డాక్టరుకు కబురుచేసింది. కూతురుమంచంమీద కూర్చొని, విసరడం మొదలుపెట్టింది. సుభద్ర దొర్లటం మానలేదు. ఇంతలో డాక్టరొచ్చాడు.

"సుభద్రా, ఏమిటి బాధ!"

"ఆయన్ని తీసుకొస్తానని వెళ్లి, అత్తగార్ని తీసుకొచ్చాడు నాన్న."

"నేను డాక్టర్నమ్మా! మీ నాన్నగారింకా రాలేదు......ఇదిగో రైలుకూసింది. ఓ ఇరవై నిముషాల్లో వస్తారు......"

అంటూ చల్లగాలి తగలడానికి, తలుపులన్నీ బార్లా తెరిచాడు. తల్లికళ్లమ్మట నీళ్లునిండుతున్నాయి. "ఇంతసేపూ సరిగ్గా మాట్లాడుతోనే ఉందండి......"

"అవునర్రోయ్. అదిగో రైలు. ఎన్ని దీపాలో! ఎంతజనమో! అంతా యాత్రికులే. ఆయ నిందులో ఎక్కడున్నారు?"

తల్లి దగ్గరగా చేర్చుకుంది కూతుర్ని. "అమ్మాయీ," అని ఏడవటం మొదలెట్టింది. "డాక్టరుగారూ, ఇంజక్షనేమైనా ఇస్తే?"

"మీరు కంగారు పడకండి." అంటూ డాక్టరు మంచుగడ్డ తెప్పించాడు రోగితలకి కట్టేనిమిత్తం.

వీథిలో గుఱ్ఱపుబండి ఆగింది. గణపతిరావు, ఆతని వెనుక రామం లోపలికొచ్చారు.

"అమ్మాయీ, ఇల్లాచూడూ. నేను! నాన్నని."



"రామం ఆమెను రెండుచేతులతోనూ పట్టుకుని,......బొంగురుపోతోన్న కంఠాన్ని సవరించుకుంటూ"

"ఆయనిందులో ఎక్కడున్నారు?"

రామం సుభద్రప్రక్కను కూచున్నాడు. "సుభద్రా, నన్ను చూడటం లేదూ? నేనే. నీ ప్రక్కనున్నా. ఇలాచూడు" అన్నాడు రామం.

సుభద్ర రామంకేసి వెఱ్ఱిదానివలె చూడ్డం ప్రారంభించింది. రామం ఆమెను రెండుచేతులతోనూ పట్టుకుని, "భయంలేదు, నేనే వచ్చేశా ఇక్కడికి" అన్నాడు, బొంగురుపోతోన్న కంఠాన్ని సవరించుకుంటూ.

డాక్టరు సోడానీటిని గ్లాసులో పోసి, రామాని కందించి, "కొంచెం త్రాగించు పంతులూ" అన్నాడు.

"సుభద్రా, కొంచెం సోడా తాగుతావా?"

సుభద్ర భర్తకేసి చూస్తూనే రెండు గుటకలు వేసింది. "మళ్లీ వెళ్లిపోతారా?" అంది. "అబ్బే ఇంకెక్కడికీ వెళ్లను." సుభద్ర ప్రక్కకొదిగి, తండ్రికేసి చూసింది. "రామం ఇక్కడే ఉండిపోతాడమ్మా." అన్నాడు గణపతిరావు.

ఒకపావుగంట గడిచింది. డాక్టరు "నేను వెడతా" నన్నాడు. "దేవుడులా వచ్చారు బాబూ మీరు?" అంది సుభద్రతల్లి డాక్టరుతో. గణపతిరావు కృతజ్ఞత తెలియజేశాడు. వెళ్లిపోయే డాక్టరు, నవ్వుతో "రోగికి సహాయకారి అయిన డాక్టరు అదుగో మంచంమీదున్నాడు" అన్నాడు. ఆతడు ఆగి, కంఠస్వరాన్ని తగ్గించి, "అతనిరాక కొంచె మాలస్య మయినట్లయితే ఏమో ఏమైయుండునో!" అని పలికేడు.

౧౧

సుభద్రకి శరీరారోగ్యం చక్కబడిందని తెలుసుకున్నప్పుడు శ్రీనివాసరావుపంతులు కమితమైనటువంటి ఆనందం కలిగింది. "మీసలహాప్రకారం నాడు తక్షణం బయలుదేరకపోయియున్నచో, మీ కోడలు నాకు దక్కియుండకపోవును." అని రామం ఉత్తరంలో ఉన్న వాక్యమును ఆయన చదువుకున్నీ, "ఈ ఒక్క విషయంలోనైనా రామానికి భగవంతుడు సాయపడ్డాడు. కేవలం మృత్యుముఖంలోంచి ఇవతలపడింది సుభద్ర" అనుకున్నాడు.

కాని పంతులుకు మాత్రం దారుఢ్యం తగ్గిపోతూంది. వృద్ధాప్యానికి తోడు శ్లేష్మవ్యాధి ఆయనను పీడించుకు తింటూంది. క్రమక్రమంగా ఆయనకు వగర్పెక్కువవజొచ్చింది. కూచుని లేవలేకపోయేవాడు.

తుద కాతడు మంచం పట్టేడు. అతనికి చాకిరీ చెయ్యడంకోసమని నౌఖర్లు నియమింపబడ్డారు. ధనికులకు పరిచారకుల లోటుండదుకదా? కాని మరణోన్ముఖుడై ఉన్న ఆవృద్ధునకు ప్రేమవాక్యం ఒక్కటీ వినిపించటంలేదు. ఆతని ప్రయాణసన్నాహాని కుచితమైన పరిస్థితులేమీ ఏర్పడటం లేదు. 'ఇంతబ్రతుకూ బ్రతికి చివరికి ఇంటివెనక్కాల చస్తున్నా'ననే తల పాతణ్ని అప్పుడప్పుడు బాధించేది. అటువంటి సమయాల్లో, రామాన్ని రప్పించుకోవాలనే తల పాతనికి కలిగేది. కాని చాలాకాలంనుంచి దూరంచేయబడి, ఇప్పుడుచచ్చి బ్రతికిన సుభద్రనుంచి రామాన్ని విడదీయడాని కాతని మనస్సొప్పలేదు. అంతేకాకుండా 'ఆతనికేమీ ముట్ట చెప్పలేకపోయాం' అనే చింత ఆయనను అనుక్షణం బాధపెడుతోండేది. అట్టి పరిస్థితుల్లో మంచం పట్టిన తనకు వెట్టిచాకిరీ చేయడానికని కుమారుణ్ని ఆహ్వానించటం ఆయనకు వెగటుగా తోచడమే కాకుండా, తనకు హక్కుకూడా లేదనే అభిప్రాయాని కొచ్చి, ఏదోవిధంగా ఈక్షుద్రజీవితానికి అంత్యదశవస్తే చాలని చావు కెదురుచూస్తున్నాడాయన.

ఈస్థితిలో ఉన్న శ్రీనివాసరావుపంతుల్ని కాస్త యోగక్షేమం కనుక్కువెడదామనే ఉద్దేశంతో ఒకనాటి మధ్యాహ్నం రావుసాహేబు సుబ్రహ్మణ్యం పంతు లొచ్చాడు. సుబ్రహ్మణ్యంగారు రిటైర్డు డిప్యూటీ కలెక్టరు. శ్రీనివాసరావుకి బాల్యస్నేహితుడు. వాళ్లిద్దరూ బాతాఖానీ మొదలెట్టి ఆ మధ్యాహ్నం గతం అంతా ఒక్కమాటు వెళ్లబోసుకున్నారు. చిన్నతనంలో వాళ్లు గోదావరిలో ఈతాలాడినరోజులు జ్ఞప్తి కొచ్చాయి.

"రఘురామయ్యదోయ్ ఈతంటే! మధ్య తిప్పదాకా వెళ్లి సునాయాసంగా తిరిగొచ్చేవాడు. ఆ సరదా నలభైయేళ్లొచ్చినా పోలేదు ముండావాడికి. కాని అదే వాడిక్కొంప తీసేసింది చిగురికి" అన్నాడు సుబ్రహ్మణ్యంగారు.

రఘురామయ్య సహాధ్యాయులలో గజయీతగాడని పేరుపడి చిగురికి గోదావరీస్రవంతికి ప్రాణాలర్పించినవాడు. ఇరవై ఏళ్ల క్రితం ఈవిధంగా మరణించిన ఆ బాల్యస్నేహితుని ప్రసంగంవచ్చినప్పుడు శ్రీనివాసరావు మనస్సు కొంచెం విషాదానికి లోనయింది.

"అతనికొడుకు చిదంబరం ఎక్కడున్నాడో ఇప్పుడు? అన్నట్లు ఆతని చదువుకు నువ్వు చాలా సహాయం చేసినట్లున్నావు."

"నాసహాయానికేంగాని, ఆతడు చాలా అదృష్టవంతుడు. ఇప్పుడు గుంటూరులో ఎక్జెక్యూటివ్ ఇంజనీయరుగా ఉంటున్నాడు."

ఈవిధంగా ఆవృద్ధులిద్దరూ చాలాసేపు 'పిచ్చాపాటీ' కబుర్లు చెప్పుకోవడం అయాక రావుసాహేబు మిత్రునిదగ్గర శెలవుపుచ్చుకున్నాడు.

ప్రసంగవశాత్తూ జ్ఞప్తికివచ్చిన చిదంబరం ఆ రాత్రిఅంతా శ్రీనివాసరావుతలపులలో సంచరించాడు. అవసరమవుతే, అవకాశ మున్నంతవరకూ ఉపకారం చేసే చిదంబరంమాట ఇంతవరకూ స్ఫురణకే రానందుల కాత డెంతో ఆశ్చర్యపడ్డాడు.

మరునాడు ఆయన, రామానికి తనదేహస్థితిని గురించి తెలియజేస్తో 'ఒక్కమారు బయలుదేరి రావలసిన' దని జాబువ్రాయించాడు.

౧౨

"ఏమే, నాన్నకి వంట్లో చాలా జబ్బుగాఉందిట! ఉత్తరం చూశావుకదూ? మఱిఏమంటావు?"

సుభద్ర ఏమీమాట్లాడలేదు కొంతసేపటివరకూ, "పోనీ నన్నుకూడా తీసుకెళ్లకూడదా?" అంది చిగురికి.

అందుకు రామం "అవునే, ఈసమయంలో మరణశయ్యమీద ఉన్న మానాన్నకి నిన్ను తీసుకువెళ్లి ఓమాటు చూపించడం బాగానే ఉంటుంది కాని—."

"కాని?" అని సుభద్ర రామంకేసి చూసినవ్వింది.

"అబ్బే, ఏమీలేదు. నీకింకా వంట్లో బారుఢ్యం పూర్తిగా చేరలేదని."

అది సకారణంకాదని రామారావుకు తెలుసును. కాని అంతకంటే ఏమీ చెప్పలేకపోయాడాతడు.

పరిస్థితులెరుగున్న సుభద్ర తనప్రయాణప్రశంసను మార్చి, "మీఅమ్మగారు మీరు మళ్లీ అక్కడకు రావడం ఇష్టపడతారా? మీరు వచ్చేటప్పుడు ఆవిడతో చెప్పనైనా లేదుకూడాను!" అంది.

"ఇష్టమైనా కాకపోయినా, నేనిప్పుడు వెళ్లటం నావిధి."

చిన్నతనంనుంచీ తల్లిదండ్రుల చెప్పుచేతల్లో పెరిగి యుక్తాయుక్తములు తెలిసినసుభద్ర తనభర్త అప్పుడు తన్ను వీడి వెళ్లిపోవలసివచ్చిన అగత్యాన్ని గ్రహింపక పోలేదు. కాని మళ్లీ ఆయింటికివెడితే ఆయన తన్ను మరచిపోతారేమో అనేభయం ముగ్ధకోమల హృదయాన్ని బాధించింది. రామం ఆమెభావాన్ని గ్రహించి, దగ్గరగాతీసుకొని "నేనొచ్చిం అప్పుడే రెండునెలలవుతోందికదా, నాలోవచ్చినమార్పింకా కనిపెట్టలేదూ నువ్వు? ఆయనకాస్త నిమ్మళంగా ఉండడంచూసి వచ్చేస్తా. ఇంకఏదో జీవనోపాధికోసం ప్రయత్నంచెయ్యద్దూ మఱి?" అన్నాడు. ఒకనిముషం గడవనిచ్చి, "నీకు జబ్బుగాఉందని విన్నప్పుడు నన్నక్కడ ఒక్కక్షణం నిలవనిచ్చాడు కాదాయన. అల్లాంటప్పుడు ......" అంటూ రామం ఆగేడు.

సున్నితహృదయంగల సుభద్ర మామగారికి తనపైనగల అనురాగాన్ని తలుచుకుంటూ తానుచూపిన స్వార్థపరత్వానికి సిగ్గుపడింది. "అవునండీ. మీరుతప్పకుండా బయల్దేరివెళ్లాలి" అంది.

రామం మెయిల్లో రాజమహేంద్రవరం చేరుకున్నాడు.

౧౩

"నాయనా, నాకాల మింక రోజులమీదుంది. నాజీవితం దుఃఖభరితమే అయినప్పటికీ, నీభార్య పుట్టెడురోగంవచ్చి బ్రతికిందన్నవార్త విని ఎంతో ఆనందించాను. దానితో సుఖంగా సంసారం గడుపుకోటానికి తగినంత ఆధారంఏమైనా నీకు కలిగినట్లయితే, నీబ్రతుకంతా నామూలాన్ని నిస్సారంగా చేయబడ్డదనే విచారంతో బాధపడే నేను ఏదో ఒకవిధమైన మనశ్శాంతితో ప్రాణాలు విడిచేస్తాను. భగవంతుడు నా కట్టి అవకాశాన్ని కలిగించి, సర్వం అంధకారంలా ఉన్న నా అవసానకాలంలో ఒకతటిల్లతను సృష్టిస్తున్నాడు. గుంటూరులో చిదంబరం అని ఎక్జెక్యూటివ్ ఇంజనీరున్నాడు. నాప్రాణమిత్రుడైన ఆతనితండ్రి అకస్మాత్తుగా చనిపోతే,ఆతనిచదువు కభ్యంతరంరాకుండా నాసహాయం అతడు కొంచెంపొందవలసొచ్చింది. ఆతడు చాలావిశ్వాసం కలవాడు. నేనంటే వాళ్లతండ్రిలాగే చూసుకొంటాడు, అందుచేత మన కుపకారం అంటే తప్పకుండా చేస్తాడు. ఉన్నతోద్యోగి అయిఉండడంవల్ల, నీకేదైన ఒకపని ఇప్పించడాని కవకాశ ముందతనికి. ఏమిటో ఇన్నాళ్లనుంచీ నాకాప్రసక్తే పోయిందెందుచేతో.ఇప్పుడైనా ఆలస్యం చెయ్యకుండా ఆతణ్ని కలుసుకోడం మంచిది. అందుచేత ఓఉత్తరం వ్రాస్తాను. అదిపుచ్చుకుని బయలుదేరి వెళ్లు" అన్నాడు శ్రీనివాసరావు రామంతో.

జననికి తనయందు జనించిన వైముఖ్యభావం వేళ్లుపారుకొని బలపడుతోన్నకొద్దీ జనకునకు తనపైగల వాత్సల్యం వృద్ధిఅవుతోందన్న తల పాయువకుని నయనాలకు నీటితెరల కల్పిస్తోంటే ఆతడు లేచి కలం, కాగితం తెచ్చాడు. చిదంబరమునకు వ్రాయవలసిన లేఖ పూర్తి అయింది. వణికేచేతులతో శ్రీనివాసరావు ఆఖరుపర్యాయము కలాన్ని పుచ్చుకుని ఉత్తరంలో సంతకం పెట్టేడు.

"తక్షణం బయలుదేరి గుంటూరువెళ్లిపో. ఏమి జరిగినదీ ఉత్తరంవ్రాయి." అన్నాడాయన.

తాను ఉత్తరంవ్రాస్తే చదువుకొనేవరకూ ఆవృద్ధుడు జీవించిఉంటాడా అనేసందేహం కలిగింది రామానికి. ఏమి జరగడాని కేముందీ? మీ యీఉత్తరం చూసినప్పుడు ఆయన నాకు చేయదగిన ఉపకారం తప్పకుండా చేస్తాడు. మీమనస్సులో ఇంక ఆవిషయమైన తలపు లుంచుకోకండి నాకేమీ లోటులేకుండా జీవితం వెళ్లిపోతుంది" అన్నాడు రామం. తండ్రిదేహస్థితి కొంచెం చక్కబడకుండా, అత డక్కడనుంచి ఎలా కదలతాడు!

కాని ఆవృద్ధునిదేహస్థితి మరి బాగుపడలేదు.వారమురోజులు గడిచినపిమ్మట వేకువజామున ఆతనిగ్రుక్కెడుప్రాణములూ ఆదేహమును విడిచిపోయినవి.

౧౪

జనకుని కంత్యక్రియలు జరిపేడు రామం. ఇంకతా నా ఇంటిలో ఉండవలసిన పనిలేదు. వీలుకూడా లేదు. శ్రీనివాసరావుమరణంతో తన్నక్కడుండేటట్లు చేసే ప్రేమబంధ మొకటీ తెగిపోయింది. తల్లికూడా, 'ఇక నీదారి నువ్వు చూసుకోవలసిందే' అని చూచాయగా తేల్చేసింది. ఆమెఅన్నగారు సకుటుంబీకుడై రాజమహేంద్రవరం రావడానికి ఏర్పాటు జరుగుతోంది. అందుచేత పదమూడవనాడే బయలుదేరి రామం అత్తవారింటికి వెళ్లిపోయాడు.

అక్కడికి వెళ్లినప్పటినుంచీ ప్రతిరోజూకూడా 'గుంటూరు వెళ్లాలి' అనుకుంటూండేవాడు. కాని ఏ రోజుకారోజే అశ్రద్ధ అయిపోయేది. అతడు సాధ్యమైనంతత్వరలో ఉద్యోగాన్ని సంపాదించుకుని ఎక్కడో స్థిరపడాలనే తలం పాతణ్ని తొందరపెడుతోనే ఉంది. కాని ఓచిన్నభయం ఆతణ్ని పీకుక్కతినేది. ఆ ఉత్తరం పట్టుకెళ్లి చూపిస్తే, ఆ చిదంబరంపంతులు 'ఇంత ఆస్తిపరుడికి ఇంకా ఉద్యోగ మెందుకో! తీరా ఇల్లాంటివాడి కేగుమాస్తాపనో ఇస్తే సరిగ్గా చేస్తాడా!' అని సందేహించక మానడు. అప్పుడు, ప్రసంగవశాత్తూ

తనయొక్క హైన్యస్థితిని ఆయనకు తెలియచేస్తూ, తల్లి పేరఉన్న డబ్బుమీద తనకేమీ హక్కు లేదనిన్నీ, తన కండులో ఏమాత్రంకూడా ముట్టే పరిస్థితులు లేవనీ, అందుచేత జీవనోపాధికి ఏదో ఉద్యోగం సంపాదించడం అత్యవసరమనీ తెలియచెప్పవలసొస్తుంది ఆ ఇంజనీయరుకి! ఇదంతా, ఆఉద్యోగిముందట వెళ్లబోయడం భావ్యంకాదని తోచింది రామానికి ఎందుచేతో.

కాని క్రమక్రమంగా "ఏదో వెఱ్ఱిఅభిమానం పెట్టుకుని, అత్తవారింట్లో కూచోడ మేమి" టనుకున్నాడు. తాను పెంపకానికెళ్లగా లభించినది తండ్రి ఆబ్దికమే అని దగ్గరబంధువు లందరికీ తెలిసినవిషయమే. కనుక ఎటువంటి సందేహం పెట్టుకోకుండా తక్షణం బయలుదేరి గుంటూరు వెళ్లాలి.

రామారావు ప్రయాణప్రయత్నం చేస్తున్నాడు. గణపతిరావు బజారునుంచి వచ్చి, "రామంవిన్నావా?" అన్నాడు.

"ఏమిటది?"

"ఆర్బత్ నాట్ కంపెనీ ఫెయి లయిందిట!"

"ఆ!" అని రామం చతికిలపడ్డాడు. అతని చెవుల నతడు నమ్మలేకపోయాడు. ఆతనికి కదినిముషాల దాకా నోట మాటరాలేదు.

"ఏమిటినాన్నా" అంటూ సుభద్ర అక్కడికొచ్చి, భర్తయొక్క నిశ్చేష్టతచూసి నిలబడిపోయింది.

గణపతిరావు నాలుక కరచుకున్నాడు. ఆర్బత్ నాట్ బ్యాంకు దివాలాతీసిందన్న వార్త తన అల్లుడి కంతబాధ కలుగచేస్తుందనుకోలేదు. ఆత డేమీ తోచక "ఇంతకీ ముసలాయన అదృష్టవంతుడు. ఈ దుర్వార్త తెలియకుండా వెళ్లిపోయాడా బ్రాహ్మడు"అన్నాడు.

"ఏదుర్వార్త నాన్నా?" అని అడిగింది సుభద్ర. "మీ మామగారు డబ్బునంతనీ వడ్డీకి వేసిన బ్యాంకు దివాలాతీసిందటమ్మా."

"ఎక్కడుందీ బ్యాంకు?"

"చెన్నపట్టణంలో."

"అంతదూరం పట్టుకెళ్లి ఎందుకు పోశారో ఆ డబ్బంతా?"

"ఆబ్యాంకుఅధికారి చాలాగొప్పవాడు. 'సర్' అనే బిరుదు సంపాదించి 'చాలా ఘరానామనిషి' అనిపించుకున్నవాడు. తక్కిన బ్యాంకులకంటే, ఈ బ్యాంకులో వడ్డీ ఎక్కువ ఇస్తారనే అభిప్రాయంతో, పెద్దపెద్ద ఉద్యోగస్థులూ, డిప్యూటీ కలకర్టుల్లా సంపాదించుకున్న డబ్బంతా అందులో వేశారు. వాళ్లంతా ఒక్కమాటుగా 'పాపర్ల'యి పోయారు. రావు సాహేబు సుబ్రహ్మణ్యంపంతులు సుమారు నలభైరెండు వేలదాకా వేశాడుట!"

"ఆడబ్బంతా పోయినట్లేనా అలాగయితే?" అంది సుభద్ర.

రామారావు సుభద్రకేసీ, మామగారివైపూ వెఱ్ఱివానిలాగ చూస్తూ, అలాగే ఉండిపోయాడు.

"రూపాయికి దమ్మిడీయో, రెండు దమ్మిడీలో వస్తుంది."

"అవుతే నాన్నా, మామగా రెంత వేశారో!" అంది సుభద్ర.

"ఎనభై వేలపయినే కాని తక్కువకాదు."

రామారావునకు కండ్లలో నీరు చేరింది. ఆతని హృదయం బరువైంది. 'ఎంతలో ఎంతమార్పొచ్చింది? కటికతో మా అమ్మకి పేదరికం సంభవించిందన్న మాట. గడచిన ఇరవై యేళ్లనుంచి సుఖజీవనాని కలవడిన ఆమె గతి ఏమిటింక? ఆమెకు నూతనంగా సంభవించిన ఘోరవైధవ్యానికి తోడు ఇటువంటి దారుణమైన ధననష్టం కలిగించిన భగవంతుణ్ని ఏమనాలి? తగిలిన వేలుకే తగిలింది దెబ్బ' అని విలపించాడాతడు.

చేతిలోని తినుబండారాన్ని కాకి తన్నుకుపోతే రోదనంచేసే బాలునివలె విలపిస్తోన్న రామాన్ని చూసి, గణపతిరా వాశ్చర్యపోయాడు. జానకమ్మ కుండే సొత్తులో ఒకపైస్తా అయినా తనది కాదని ఎరుగుండీ కూడా ఎందుకిల్లా వాపోవడం తన అల్లుడు? ఇతరుల

కాపదలొచ్చినప్పుడు సానుభూతి కనపర్చటం ధర్మమే. కాని రావుసాహేబు సుబ్రహ్మణ్యంపంతులయెడల ఎంతసానుభూతి చూపేమో అంతకంటే ఎక్కువగా విచారించక్కర్లేదు, జానికమ్మధనం పోయినప్పుడు' అని ఆతని అభిప్రాయం.

గణపతిరావు లోనికిపోయాక, సుభద్ర ఖిన్నుడై యున్న భర్తదగ్గరకొచ్చి, 'పోనీ రేపు వెళ్లకూడదూ ఆక్కూర్కు?' అంది. అంతేవరకూ ఏమీ తోచక కూచున్న రామారావు ఏదో ఓనిశ్చయానికి వచ్చినట్లు తెలియ చేసే శిరఃకంపంతో చివాలునలేచి, సూటుకేసు చేత పుచ్చుకున్నాడు. 'ఇదిగో, వెడుతున్నా. ఏమయినదీ ఉత్తరం వ్రాస్తాలే' అంటూ వెనక్కి తిరగకుండా స్టేషనువైపు నడచిపోయాడాతడు.

౧౫

తనధనం అంతా తనకు దూరమయిపోయిం దని విన్నజానకమ్మ 'బారు'మని ఏడవడం మొదలెట్టింది. ధనమూలమైన ఈవిశాలప్రపంచంలో, ఘోరదారిద్ర్యంలో మేల్కాంచిన ఆమెకు నిలువడానికి తావులేదు.

ఆమెకు రెండవతూరి పరామర్శ ప్రారంభమయింది. ఇరుగుపొరుగమ్మలు, శోకజలధిలోపడి కొట్టుకొంటూన్న ఆమెను ఓదారుస్తో 'నీకేమమ్మా నిక్షేపం లాంటి అన్నగారున్నాడు. వెళ్లిపోయి, పుట్టింట హాయిగా ఉండొచ్చు' అన్నారు.

పిల్లల్ని, పెళ్లాన్ని తీసుకొనివస్తానని చెప్పివెళ్లిన అన్నగారు నాడో, మర్నాడో అక్కడికి చేరుకుంటాడు. పోయినసిరితో ఆతణ్నేలాగా ఆహ్వానంచెయ్యడం? సంసారంతో వచ్చి ఆపట్టణంలో స్థిరపడదామనుకొన్న ఆతడు, వచ్చినదారినే వెళ్లిపోవడమే కాకుండా, నిర్భాగ్యురాలైన తన్నుకూడా వెంటపెట్టుకుపోవలసొస్తోంది. తాను విధవరాలైపోవడమే కాకుండా, పొరుగింట పడిఉండవలసొస్తోంది. ఎంతదారుణం!

క్రమంగా ఆమె శోకాన్ని దిగమ్రింగుకుంటూ, 'కానున్నది కాకమానదుకదా' అనుకుని గుండెనిబ్బరం చేసుకోడానికి ప్రయత్నించింది.

జానకమ్మ ఏరోజు కారోజు సోదరుని ఆగమనాని కెదురుచూస్తోంది. అనుకున్ననాటి కయిదారు రోజులు గడిచిపోయాయి. ఆఖరి కాతనివద్దనుండి జాబొకటి వచ్చింది. అందులో ఆతడు తాను రాజమహేంద్రవరంనుంచి ఇంటికివెళ్లినపిమ్మట తనఅభిప్రాయం మార్చుకోవలసొచ్చిందని తెలియచేశాడు. "చెల్లెలికి దత్తపుత్రుడుండగా, అతణ్ని త్రోసిరాజని తాను సకుటుంబంగా వెళ్లి చెల్లెలిగ్గారింట కూర్చోడం లోకసమ్మతిమైన పనికాదు." అనేకారణం తనప్రయాణాన్ని ఆపుచేసిందని సూచించాడు.

'ఇంకా వాళ్లకు తెలియనేలేదా?' అనుకుంది జానకమ్మ. తెలియకపోవడమేమిటి? పరశురామప్రీతి అవుతోన్న పల్లెగూడెంలో నలుదెసలా వ్యాపించే భయంకరాగ్నికీలలవలె దేశమంతటా ఆక్రమించుకుపోయిన ఆర్బత్‌నాట్ కంపెనీ దివాలాసంగతి తనఅన్నకు తెలియకుండా ఎలావుంటుంది? అన్నగారు ఇంటికివెళ్లి ఉద్దేశంమార్చుకోవడానికి కారణం లోకాపవాదకాదు. లోకాపవాదకు వెఱపుగలవాళ్లే తనవాళ్లవుతే, తనకు అటువంటి ముసలిమగణ్ని ఎందుకుకట్టిపెట్టేరు? ఇపుడు వేదాంతం చెపుతోన్న తనఅన్నగారీవరలో తమయింట మాసాలతరబడి మేసి, తుదకు క్రొత్తబట్టలు కట్టుకొని ఎన్నిమాట్లు వెళ్లలేదు? అప్పుడీ లోకం అంటే ఉన్న భయం ఏమైంది? తాను ధనికురాలైన వితంతువుగనుక తనధనముపై ఆధారపడి ఉండవచ్చునన్న మనోనిశ్చయంతో నిర్వక్కమించిన ఆతడు, తనధనమంతా గంగలో కలియడంవల్ల, ఆధారభూతం అవుతుందనుకున్న తాను పెనుభూతమై ఉదరపోషణార్థమై ఆతణ్నే పీక్కుతింటుదేమో అన్నభయంచేత, అన్న భయపడ్డాడు కాని లోకాపవాదభయ మేమాత్రం లే దాతనికి.

జానకమ్మ సోదరుని సంకుచిత స్వభావాన్ని గ్రహించి ఉగ్రురాలయిపోయింది. కాని ఏమిలాభము? ఆమె జీవన్మృత, నిర్ధనురాలు, తృణప్రాయంగా చూడబడుతుంది.

ధనము సర్వార్థసాధనము. బంధువుల నాకర్షింపజేసే శక్తి అందులోఉంది. రెండుఇటుకల్ని ఐక్యమయేటట్లు చేసే 'సిమెంటు'లాగ ధనం రెండువ్యక్తుల్ని దగ్గరగా తీసుకొస్తుంది. ధనంతో పాటు సంబంధాలుకూడా అదృశ్యమవుతాయి. ఇది లోకప్రవృత్తి.

ఇంక తనకు గత్యంతరమేమిటని జానికమ్మ తలపోసింది. ఆ తల పామెమానసవీథిలో చొరబడినప్పుడామెకు జగత్తంతా అంధకారమైపోయింది. తనశిరస్సుపైన పూలవానకురిసి తనకు స్వాగతమిస్తారన్న బంధువుల గృహాలన్నీ మూసివేయబడ్డ తలుపులతో అవుపించాయి ఆమెకు. తానొంటరిగానున్న ఆవిశాలభవనాన్ని నలుదెసలా ఒకమారామె పరికించింది. ఆమె ఒడలు కంపించింది. ఆయింటికద్దెనివ్వటాని కామెకు స్తోమ లేదే? ఆగృహంలో ఒక్కక్షణం ఉండడాని కామెకు త్రాణ లేదు. శీఘ్రంగా వదిలెయ్యాలి ఆయిల్లు. వదలిఎక్కడకి పోవడం? సంసార మహాసాగరాన్ని ధనమనే నౌకా సహాయాన్ని సురక్షితంగా దాటి దరి జేరగలనన్న ధైర్యంతో ఉన్నఆమె ఆనౌక అకస్మాత్తుగా భిన్నమైపోవడంచేత నీటిలోపడి కొట్టుకుంటూ గుటకవేస్తోంది.

రెండుదినాలు అతిమందంగా గడిచాక, జానకమ్మకు మఱొకజాబు వచ్చింది. దాన్ని వ్రాసినవాడు రామారావు. ఆమె కవరునుచింపి చదివింది.

ఆతడు తన్ను తండ్రి అవసానకాలంలో పిలిపించి, తనకుద్యోగం వచ్చేనిమిత్తమై చిదంబరంపంతులుకు శిపార్సుచేస్తో వ్రాసిఇచ్చిన ఉత్తరాన్నిగురించి తన జాబుయొక్క మొదటిభాగంలో తల్లికి తెలియజేశాడు. చిదంబరంపంతులు ఆపెద్దకుటుంబానికి అకస్మాత్తుగా సంభవించిన కష్టాలకు అపరిమితమైన సానుభూతి కనపరుస్తూ, తనకు తగినటువంటి ఉద్యోగాన్ని చూసి ఇప్పిస్తానని వాగ్దత్తంచేశాడు.

జానకమ్మ మొదటిపేజీముగించి రెండవపుటకొచ్చింది.

"తగిన ప్రయత్నాలన్నీ జరుగుతున్నాయి. 'ఇంటికివెళ్లి ...సంసారాన్ని తెచ్చుకో. ఈ లోపున ఆర్డరుకాగితం తయారు చేయిస్తాను.' అని పంతులుగారు నాతో ఈ ఉదయం చెప్పేరు. సాయంకాలంబండిలో బయలుదేరుతున్నా. కాని రాజమహేంద్రవరంలో ఇప్పుడు దిగను. ఏకంగా పిఠాపురంవెళ్లి, మీకోడల్ని తీసుకొని రాజమండ్రీ ఎల్లుండి ఉదయానికి వస్తాను. ఈ లోపుగా, నీవు ప్రయాణసన్నాహం చేయడానికని ఈ ఉత్తరంవ్రాస్తున్నా.

అమ్మా, మనకు సంభవించిన రెండు కష్టాలూ కూడా సామాన్యమైనవికావి. కాని ధైర్యం వహించి, సహించుకోవడంకన్న గత్యంతరం లేదు. కష్టాలెల్ల కాలం ఉండవు. బెంగపెట్టుకోవద్దు.

గుంటూరు, }
౨౩-౧౨-౧౯౦౭. }

కుమారుడు,
రామారావు."

జానకమ్మ భర్త దివంగతుడైనప్పటి దృశ్యాన్ని కండ్లారా చూసింది. తన ధనరాశి దగ్ధమైపోయిందన్న దుర్వార్త చెవులారా వింది. కాని ఆదుఃఖాలను ప్రయత్నించి దిగమ్రింగుకో కలుగుతోంది ఆమె. రామం వ్రాసిన జాబును చదవటం ముగిసినపిమ్మట చెప్ప నశక్యమై, అమితమైనటువంటి బాధ ఒకటి ఆమె హృదయాన్ని ఆవరించుకుంది. ఆదుర్భరహృదయ భారాని కామె రూపిమియ్యలేకపోయింది. ఆమె నేల కొరిగిపోయి, దొర్లడం ప్రారంభించింది.

విగతభర్తృకయై, దరిద్రదేవతయొక్క భయంకరమైన కౌగిలిలో చిక్కి పెనగులాడుతోన్న తన్ను చేరి "కుమారుణ్ని!" అని రక్షించటాని కుద్యమిస్తున్నాడు రామం. ఆతడు తమతో ఉన్నంతకాలం తాను ఆతణ్ని పాలూ పెరుగూ పోసి పెంచినమాట నిజమే. కాని మాంసాభిలాషతో ఎప్పుడో ఓనాడు తుదముట్టింపబడుటకే ఉద్దేశించబడి పెంచబడే మేకలూ మొదలైన సాధుజంతువులకంటే నిర్భాగ్యస్థితిలో పెరిగేడు రామం. ఆజంతువులను పెంచి, చంపడంలో మాంసాసక్తి కనబడుతోంది. కాని ఈసాధుప్రాణిని, ఇతనికి సంబంధించిన ఇతరసాధుప్రాణులనూ,

'హింసిద్దాం' అని ఖ్యాపకున్న అతిక్రూరమైన తనఉద్యమానికి కారణం అగుపించదు. అకారణంగా హింస కొడబడ్డ తాను రాక్షసికంటే అధమురా లన్నమాట. తనకా ఆఉత్తముడు కుమారుడు? నూరు జన్మలు తల క్రిందుగా తపముచేసినా అటువంటి తలపుకూడా తన మనస్సులో జనించడానికి హక్కు లేదు. రామాన్ని కన్నతల్లి మహాసాధ్వీమతల్లి. ఆపెకడుపుచల్లదనం తనవంటి గొడ్డురాలి కెల్లా కలుగుతుంది?

జానకమ్మకు ఉన్నట్లుండి ఆఉత్తరం వ్రాస్త రామం కాదేమో అనే వెఱ్ఱిసందేహం కలిగెంది. ఆమె మళ్లీ ఒకమాటు చదివి చూసుకుంది. అనుమానమేమిటి? రెండురోజులలో తన కోడల్ని తీసుకునివచ్చేస్తున్నాడు రామం. ఏముఖంతోటి తను వాళ్లిద్దర్నీ ఎదుర్కొనకలదు!

ఆమె ఉత్తరంకేసి చూస్తూనే ఉంది. అందులో ఉన్న ప్రతీఅక్షరం క్రమంగా పరిమాణంలో పెద్దదవుతో నలుప్రక్కలా ప్రాకిపోతోన్నట్లుగా తోచిందామెకు. ఆమెకు ప్రతీఅక్షరంలోంచీ ఏదోముఖం తొంగిచూస్తూన్నట్లుగా అయింది. అదిగో సుభద్రే. సుభద్రా! ఈమురార్గురాలిమీద కసితీర్చుకో. సలసలకాగే నూనెలో నన్ను ముంచు. వేదన తెలియచేస్తానేమో చూడు...... అదుగో, నన్ను వద్దంటే ఎందుకూ అలాపిలుస్తావు? మీరిద్దరూ ఏ బాధ పెట్టినా ఒప్పుదలే కాని, 'అమ్మ', 'అత్తా' అనిపిలుస్తే సహించలేను... సుభద్రా! సుభద్రా! ఏమమ్మా, మాట్లాడవు? అవును. ఎందుకుమాట్లాడాలి? నిన్నెప్పుడైనా మనఃస్ఫూర్తిగా పలుకరించానా? అదుగో రామం వస్తున్నాడు. ఎందుకూఅనవ్వు? నామీద పగసాధించటాని



"రామారావు పళ్లెంలోఉన్న బియ్యంమీద ఆనామాక్షరాలను చిత్రించాడు."

కొచ్చారని తలుస్తోన్న నాభ్రమచూసి నవ్వుకుంటున్నారు. మీ సాధుహృదయాలలో 'పగ' అనే విషపువిత్తనానికి స్థానంలేందే.

ఈవిధంగా ఆమె కలతనిద్రలోవలె ఆ రెండు దినాలూ గడిపింది.

౧౬

"అమ్మా!" అని తలుపుదగ్గర పిలుపు వినబడింది. జానకమ్మ తలుపు తెరిచింది. సుభద్ర మొదట లోన ప్రవేశించింది. ఆమె రక్తహీనమై యున్న జానకమ్మ

ముఖంచూసి, "అత్తయ్యా!" అంది. నిలబడ్డలేకుండా ఉన్న జానకమ్మను చూసి పడిపోతుందనే అభిప్రాయంతో సుభద్ర ఆమెను పట్టుకుంది. జానకమ్మ కోడల్ని కౌగలించుకుని ఏడవడం మొదలెట్టింది.

బండివాణ్ణి పంపి, రామం లోపలి కొచ్చాడు. "రామం!" అంది తల్లి.

"ఏమమ్మా!"

ఆమె మాటలాడలేకపోయింది. ఈ రెండుదినాల నుంచీకూడా, వాళ్లు రావడంతోటే తనుచేసిన మహాపరాధమునకు క్షమార్పణ కోరుకోవాలని నిశ్చయించుకుంది. ఎందుచేతో ఇప్పుడామె 'నన్ను క్షమించరూ?' అని అడగలేకపోయింది. ఆమెకు దుఃఖం పొంగి వస్తూంది.

రామం ఆమె నాస్థితిలో ఎన్నడూ చూడలేదు. ఆతనిహృదయం నీరయిపోయింది. 'అమ్మా, జరిగినదంతా మరచిపోవాలి' అన్నాడు.

సుభద్ర నీళ్లుపోసుకొని వంటచేసేసింది.

సామానంతా చకచకా సర్దబడింది. మరి రెండు రోజులయాక రామం తల్లినీ, భార్యనూ వెంటబెట్టుకుని గుంటూరు చేరేడు.

౧౭

సుమారు సంవత్సర మయాక, ఒకనాడు గుంటూరులో ఓవర్‌సీర్ రామారావుగారింట 'బాలసారె' అని బ్రాహ్మలంతా చేరేరు. బాలెంతరాలను సుభద్ర చంటిబిడ్డను ఒడిలో నుంచుకుని, రామారావుప్రక్కన పీటమీద కూర్చుంది. బాలికకు నామకరణ సమయమేతెంచింది. పురోహితు "డేమి నిశ్చయించా" రని ప్రశ్నించాడు. ఆదంపతు లిద్దరినోళ్లమ్మటా కూడా 'జానకీదేవి' అన్నశబ్దం ఒక్కమాటుగా జనించింది. రామారావు పళ్లెంలోఉన్న బియ్యంమీద ఆనామాక్షరాలను చిత్రించాడు. కొంచెందూరాన నిలిచిచూస్తూన్న జానకమ్మకు హృదయ ముప్పొంగి, ఆమెనయనాల నుండి రెండానందాశ్రువులు రాలేయి.

విష్ణుకుండివంశము కడచిన నెలభారతి
పుట. ౭౫౫ లోని పట్టికలో సవరణ

క్రీస్తుశక కాలము విష్ణుకుండులు

౪౨౫—౪౫౦...౧ మొదటిమాధవవర్మ
|
౨ దేవవర్మ
|
౪౫౦—౫౦౦...౩ రెండవమాధవవర్మ
|
౪ మొదటి విక్రమేంద్రవర్మ
|
౫౦౦—౫౩౦...౫ఇంద్రవర్మ లేక ఇంద్రభట్టారకవర్మ
|
౫౩౦—౫౪౦...౬ రెండవవిక్రమేంద్రవర్మ
|
౫౪౦—౫౪౬...౭ గోవిందవర్మ
|
౫౪౬—౬౧౦...౮ మూడవ మాధవవర్మ
|
౬౧౦—౬౨౩...౯ మంచణ్యభట్టారకుడు

భా. వేం. కృ.